# పరోపకారి

మా రూము కిటికీ దక్షిణవైపు వుండడంవల్ల ఒక రకంగా ఇబ్బంది, ఇంకొకరకంగా సౌకర్యమూను. మంచి గాలి వచ్చేది. కాని... ఆ వైపున పొరుగింటివారి దొడ్డి వుంది. దొడ్లోకి పొద్దుకూకులు ఎవరో ఒక స్త్రీ రావటం, స్నానానికి సిద్ధపడడం, మేము కిటికీతలుపును దభేలున వేసుకోవాల్సి రావటం సహజమైనాయి. సంవత్సరంనుంచీ వున్నా ఆపొరుగింటిలో ఎందరున్నారో, వాళ్ళంతా ఆడవాళ్ళేనేమో, మొగవాళ్ళుకూడా వున్నారేమో అనే వివరాలు రూంలో వున్న మాముగ్గురికీ అనేక కారణాలవల్ల తెలీదు. విశ్వం అప్పుడప్పుడు కిటికి వెయ్యాల్సొచ్చినప్పుడు మాత్రం, ''ఆ యింట్లో ఆడవాళ్లు తప్ప ఇంకెవరూ లేరు!'' అనేవాడు విసుగ్గా. ఆ ఒపీనియన్‌తో నేనూ, వాసూ ఏకీభవించకపోయినా, ఆ పొరుగింట్లో కనీసం (మేము చూసినంతవరకు) అరడజన్ మంది యువతులూ, ఇద్దరు ముసలమ్మలు వున్నారని తేల్చుకున్నాం.

ఆవేళ పొద్దుటిపూట, వాసు సెల్ఫుషేవ్ చేసుకుంటున్నాడు. నేను కాలేజీ సరంజామా సర్దుకుంటున్నాను. విశ్వం బైటికి వెళ్లినవాడు ఇంకా తిరిగిరాలేదు. దక్షిణపు కిటికీ బార్లా తీసివుంది. చల్లగాలి ఆగదంతా కలయదిరుగుతోంది. వాసు గీసేగడ్డం ఆపి, కిటికీవంక చూశాడు హఠాత్తుగా. ఎందుకో అనుకున్నాను నేను. అట్లా ఒకక్షణంచూసి, నావైపు తిరిగి, '' ఏమో! ఇక్కణ్నించి ఎన్ని ప్రమాదాలు వచ్చినా, కిటికీ వెయ్యొద్దు మనం!'' అన్నాడు సీరియస్‌గా.

'' ఎందుకని? శతమానంభవతి మంత్రపుష్పాలు తినాలని కోర్కెగావుందా నీకేమైనా?'' అన్నాను అంతకన్నా సీరియస్‌గా.

'' ఏమీ అవసరంలేదు? మనం కిటికీ తెరిచేవుంచడానికి మనని ఎవరు ఏవిధంగా నిరోధిస్తారో చూచితీరాలి! అని నా పట్టుదల!'' వాసు గట్టిగా నొక్కి మాట్లాడుతూ ఇంకా కిటికీవంకే చూస్తున్నాడు.

''నీ పట్టుదలకి అంతకన్న వేరే ఏకారణమూ లేదని నేను నమ్మడం ఎలా? సంవత్సరంబట్టి లేని ఈ చైతన్యం ఇవ్వాళ పొద్దున్నే ఆకస్మాత్తుగా కలిగినందుకు కారణం అసలే లేదంటే, నేను నమ్మనోయ్ సుతరామూ''! అన్నాను గట్టిగా.

వాసు గడ్డంపని పూర్తిచేసి తువ్వాలుతో మొహం తుడుచుకుంటూ, ''నువ్వన్నదిగూడా నిజమే. పన్నెండురోజుల ఆలోచన తర్వాత ఈనిర్ణయానికి ఇవ్వాళే వచ్చాను. ఇక ఆ నిర్ణయాన్ని అమల్లో పెట్టడమే!'' అన్నాడు సహజంగా. నాతో మాట్లాడుతున్నాడన్న మాటేగాని వాడికళ్ళన్నీ కిటికీ మీదే వున్నాయ్. నా కనుమానం వేసి కిటికీవైపు చూద్దును గదా, అవతల దొడ్లో ఒక యువతి - దాదాపు

ఇరవైయేళ్ళు వుంటయి, ఎర్రగా వుంది - అంట్లుతోముతున్న దృశ్యం కనిపించింది. ఓ! ఇదా సందర్భం అనుకున్నాను. వీ డేదో ప్రణయగాథ నడుపుతున్నాడల్లేవుంది అని భావించుకుని ''అయితే వాసూ, నేను ప్రస్తుతం ఇక్కణ్ణించి కాసేపు ఎటన్నా షికారుపోతాను; లేదా కాలేజీకి వెళ్ళి నీకోసం వెయిట్‌చేస్తూవుంటాను!'' అన్నాను అర్థోక్తిగా.

'' ఆ మాత్రం లౌక్యం నీకు తెలుసుననే నావుద్దేశం వేణూ!'' అన్నాడు - వీడి అఖాయిత్యం మండ! నేనూ వెంటనే బయటికి పోవాలని 'బైక్' బయటికి తెచ్చుకుంటున్నాను. సరిగ్గా ఇట్లాంటి సమయంలోనే విశ్వం గదిలోకి వచ్చాడు. వచ్చినవాడు వూరుకోవచ్చునా! ఏదో నిర్ఘాంతపోయినవాడికి మల్లే పోజుపెట్టి, '' ఆశ్చర్యం! ఆశ్చర్యం! 81/2 కే వేణు కాలేజీకి బయల్దేరడం వాసు ఇట్లా ఒంటరిపాటున గదిలో కూర్చుండడం...'' అన్నాడు సగంలో ఆపి.

నేను, బైక్‌ని బైటనేవుంచి, మళ్ళీ రూంలోకొచ్చాను. వాసు విశ్వాన్ని వురిమిచూసి, '' ఆహా! ఏమాశ్చర్యడ్డావురా! ఇక్కడేంవింతలు జరిగినాయని కంగారుగా అరుస్తావట్లా?'' అన్నాడు కోపంగా. విశ్వం నవ్వడం తప్ప ఇంకేమీ చెయ్యలేదు.

నాకు ఏదో వింతజరక్కపోతే విశ్వం వెంటనే అట్లా డ్రామాలోలాగా పోజ్ పెట్టి మాట్లాడడు అనిపించి, ''వాసుదేవరావు ఇవ్వాళ కాలేజీకి అటెండ్‌కాడని తోస్తుంది గనక, మేమిద్దరం పోవచ్చా?'' అని కిటికీవంక చూశాను.

వాసు వుద్రేకం కనపరుస్తాడనుకున్నాను. కాని మామూలుగా వాడు ఎప్పుడూ నవ్వేపద్ధతిలోనే చిరునవ్వు తెచ్చుకున్నాడు. రిస్టువాచివంకచూసి, ''నాకూ టైంఅయింది. హోటల్‌కెళ్ళి భోంచేసి వెళ్దాం పదండి'' అన్నాడు వెళ్ళటానికి తయారై.

విశ్వం, నేనూ కాస్త ఆశ్చర్యచకితులమైనాం. ప్రణయగాథలో, పన్నెండురోజులబట్టి అహర్నిశలు ఆలోచించి, కనీసపు నిర్ణయాలు తీసుకుని చూపులు ప్రారంభించినవాడు, ఛాన్సంటూవస్తే వొదులుకుని వొచ్చేస్తాడని మేంమాత్రం ఎట్లా అనుకోగలం?

ఆవేళ సాయంత్రం పెందలాడే రూంకు బయల్దేరాడు వాసు. వాణ్ణి వెంబడిద్దామని నేనంటే, విశ్వం ఒప్పుకోలేదు. ''నీకెందుకు ఆదుర్దా? వాడిగొడవేదో వాణ్ణిపడనీయరాదూ?'' అన్నాడు.

'అంతేలే' అనేసి నేనూ అంగీకరించి వూరుకున్నాను. ఇద్దరం బీచ్‌కి బయల్దేరాం. చేపాక్ బీచ్ ఎట్లాగైనా కాస్త విశ్రాంతిగా వుంటుంది. రేడియోగోలకి దూరంగా లేవర్సు పాత్‌లో సిమెంటుబల్లమీద కూర్చుని వొచ్చేపోయ్యే కార్లని మనుష్యుల్నీ పరిశీలిస్తూ సంభాషణ ప్రారంభించాం. మేమ్ముగ్గురం బి.యే. ఫస్ట్ ఇయర్ చదువుతున్నాం. అనేక కారణాల వల్ల ఒక్క రూంలోనే వుంటున్నాం. మా రూం తేనాంపేటలో వుంది! పరిసరమంతా రమ్యంగా వుంటుంది. మద్రాసు నగరంలో వుండే నిరంతర అశాంతి, కార్లగోలా మాగదికి కాస్త దూరంగానే వుంటాయి.

ఈ గదినిగురించి వివరాలు తెలియడం చాలా అవసరం. గది అంటే చిన్నదీ చితకదీ కాదు.

పెద్దగది. నాలుగు అల్మేరాలూ, ఒక కిటికీ తూర్పువైపున సింహద్వారం, పడమట వైపు ఒక వాకిలీ, వున్నాయి. పడమటవైపు వాకిలి ఇంటివాళ్ళ పోర్షనులోకి వెడుతుంది గనక అదెప్పుడూ మూసేవుంటుంది. గదికి ఒక్కకిటికీ మాత్రమే వున్నా తూర్పు వాకిలిగుండా సముద్రపుగాలి వస్తుంది. అల్మేరాలనిండా పుస్తకాలూ, పాతపత్రికలూ పడి వుంటాయి. చిందరవందరగా దక్షిణపు కిటికీ మీద మంచినీళ్ళకూజా, గాజుగ్లాసూ వుంటాయి. పడమట వైపు సింహద్వారానికి ఎదురుగా, పెద్ద టేబిల్ మీద సినిమా య్యాక్టర్ల ఫొటోలు, జాతీయ నాయకుల ఫొటోలు స్టాండ్ ఫ్రేంలలో అమర్చివుంటాయి. ఇంటివారు ఆంధ్రులు. కృష్ణా జిల్లా నియోగులు. చాలా నిదానస్తులూ, మంచివాళ్ళూను. అంచేతనే కాలేజీ దూరమైనా ఈరూంలోనే వుంటూ వచ్చాం ముగ్గురం. కాలేజీలో మిగతా స్టూడెంట్లతో అట్టే సంబంధం వుంచుకోక ప్రత్యేకంగా వుండిపోయినాం. దానికి కారణం దాదాపు మా ముగ్గురి భావాలూ ఒక్కరీతిగా వుండటమే. ఈ కారణంచేత, కాలేజీలో మిగతా స్టూడెంట్లను మేము వెలిగా చూస్తున్నామని అర్థం కాదు. సోషల్ఎఫైర్సులో కలిసిమెలసి వున్నా, వ్యక్తిగతంగానూ, చదువులోనూ మా ప్రత్యేకతని నిలుపుకోవాలని ప్రయత్నించాం; అంతే.

ఆరోజున రాత్రి 8 గంటలవరకు, నేనూ, విశ్వం, లేవర్సు పార్క్‌లో కూర్చున్నాం. అనేక విషయాల్లో చర్చలు చేస్తూ 'హస్కాలజీ' అనే శాస్త్రంయొక్క లోతుపాతులు తీసి హోటలుకి బయల్దేరాం. వాల్‌జారోడ్ దాకా నెమ్మదిగా నడుస్తూ మౌనం పాటించిన విశ్వం బస్‌స్టాండ్ దగ్గిరికి రాగానే అకస్మాత్తుగా కాలుస్తున్న సిగరెట్ కిందపారేసి ''వేణూ! వీడు ఇట్లా ప్రణయనాటకంలో దిగితే చదువు నాశనం అవుతుంది గదరా?'' అన్నాడు దిగులు వెలువరించే స్వరంలో.

ఆ మాటేనేనూ అనుకొంటున్నారోయ్. విరహవేదనలో ఎడ్యుకేషన్ ఐస్ ఐ కరిగిపోగలదు!'' అన్నాను. ఇంతలో బస్ వచ్చింది. మౌంట్‌రోడ్‌వరకూ వేరేబస్‌లో వెళ్ళి హోటల్‌కు జేరాం.

భోజనం దగ్గర విశ్వం మళ్ళీ వాసుమాట ఎత్తాడు - '' ఇన్నాళ్ళూ మనం ఈ విషయాన్ని గ్రహించకుండా వూరుకోటం ప్రమాదించింది!'' అన్నాడు.

''అమ్మాయి ఎవరూ అసలు? వీణ్ని ప్రేమించే అంత సాహసం వున్నదంటే ఆమె అసాధ్యురాలే అయివుండాలి'' అన్నాను.

'' ఆ లెఖ్ఖన వీడేమన్నా తక్కువవాడా? అయితే, చదువు పూర్తయేదాకా పెళ్ళి చేసికోనని, స్త్రీ వంకే చూడనని, ప్రగల్బాలుకొట్టిన వీడు ఇలా ప్రవర్తిస్తాడనుకోలేదు... కాని... ఇదంతా నిజమేనా? వీడు నిజంగా ప్రణయ నాటకం సాగిస్తున్నాడంటావా?''

''అనుమానం కూడానా? పొద్దున గంటసేపు కిటికీ వంకే చూస్తూ కూచున్నాడు. పైగా పన్నెండు రోజులనుంచి 'అబ్జర్వ్' చేస్తున్నానని చెప్పాడు. ఇంకా తార్కాణం ఏం కావాలి?''

''అయితే ఇప్పణ్నించి వీణ్ణి మనం దారినపెట్టాలి!''

''తప్పకుండానూ!''

భోజనం పూర్తిచేసేప్పటికి రాత్రి తొమ్మిదిన్నర అయింది. వెన్నెల హాయిగా కాస్తోంది. ఆకాశంనిండా నక్షత్రాలు. ''వాసు భోజనం చేసి వెళ్ళిపోయినాడు'' అని వడ్డించే కుర్రాడు చెప్పాడు. బయల్దేరాం. ఇంకేం! వాసు గదిలో ఒంటరిగా దక్షిణపుకిటికీగుండా ప్రేమగాథ సాగిస్తుంటాడు. ఈ గొడవనించి వాణ్ణి తప్పించాలి. అది స్నేహితులమైనందుకు మనకర్తవ్యమయింది. యెవరూ యివ్వకపోయినా గాని, ఆ అధికారం మేము తీసుకుని వెన్నెల్నీ ప్రకృతి సౌందర్యాన్ని గమనించకుండా గబగబా మా రూమ్‌వైపుకి నడకసాగించాం. రూమ్ దగ్గిరపడ్డకొద్దీ వాసు ఏం చేస్తుంటాడో అనే జిజ్ఞాస యెక్కువైంది యిద్దరికీ. రూం వాకిలిగుండా టేబిల్‌లైట్ వెలుగు బైటకు ప్రసరిస్తోంది. వీడు యింకా మెలుకువతోనే వున్నాడన్నమాట! లోపలికెళ్ళాం. వాసు కిటికీదగ్గిర ఈజీఛైరులో పడుకుని సిగరెట్ తగలేస్తో యేదో పుస్తకం పరధ్యానంగా చదువుతున్నాడు. ఆ చప్పుడువిని తిరిగిచూశాడు. విశ్వం చెప్పులు బయట విడిచి లోపలికివస్తూ ''నాటకంలో యిది యెన్నో రంగంరా బ్రదర్'' అని అడిగాడు గొంతు ఓ మాదిరి వెక్కిరింపుగా పెట్టి.

వాసులో ఏ కదలికా రాలేదు సరిగదా, చిరునవ్వన్నా నవ్వలేదు. వాడిచదువులో వాడు వుండిపోయినాడు. విశ్వం ఈ మౌనవాతావరణాన్ని భరించలేకపోయినాడు. ఐదు నిమిషాలకన్న. ''వాసూ'' అని గట్టిగా పిలిచాడు. వాసు చేతిలో పుస్తకం మడతపెట్టి, లేచి కూచున్నాడు విసురుగా. ''యేం మునిగిపోయిందని అలా అరుస్తున్నావురా!'' అన్నాడు విశ్వాన్ని కొంచెం విసురుగా చూచి. నాకు కోపంవచ్చింది. ''మేము పలకరించినా పలకనంత బిజీగా వున్నావే మరీ'' అన్నాను.

వాసు నన్నూ, విశ్వాన్ని కాస్త తీక్షణంగా చూశాడు ఒక క్షణం. తర్వాత ఆజ్ఞాపూర్వక స్వరంలో ''అబ్బాయిలూ నామాట కాస్త వినండి. ఈపూట వెంటనే మీరిద్దరూ మంచంమీద పడుకుని నిద్రపోండి... నా వ్యవహారంలో మీరు జోక్యం కలుగజేసుకోవద్దు. తెల్లారి మీకు విషయం అంతా చెబుతాలే'' అన్నాడు.

మాలో ఇదే గొడవ. ఎదటివాడు కాస్త నిక్కచ్చిగా ఏదన్నా చెప్పాడా ఆపైన మాటామంతీ లేకుండా ఆప్రకారం నడుచుకోటమే! వెంటనే విశ్వం నేనూ క్యాంప్‌కాట్‌ల మీద పడుకున్నాం. కాని నిద్రపట్టలేదు. వాసు ఎవరికోసం అట్లా కూచున్నాడో ఆమెని చూడాలని మాకూ ఆశగానేవుంది మరి. వూపిరి బిగపట్టిదుప్పటి ముసుగుతన్ని కదలకుండా పడుకున్నాం.

రాత్రి పదకొండుగంటలు కావస్తోంది. చాలవరకూ లోపలవున్న తృష్ణకొద్దీ నిద్రపట్టక, మసక మసకగా వెలుగుతున్న టేబిల్‌లైట్‌కాంతిలో వాసుని పరీక్షిస్తూపడుకున్నాను. దాహమవుతున్నా లేకండా పడుకునే వుండాలాయె! విశ్వం గూడా అట్లాగే పడుకునివున్నాడు అని నావూహ. కిటికీబైట వెన్నెల పిండారపోసినట్లు వుంది. ప్రకృతి అంతా నిశ్శబ్దంగా, నిశ్చింతగా గాఢనిద్రపోతోంది. వాసు కిటికీవైపే చూస్తో, ఎదురుచూస్తున్నాడు ఆమెకొరకు. సిగరెట్ తర్వాత సిగరెట్ తగలేస్తున్నాడు. నాకూ సిగరెట్ తాగాలని బుద్ధిపుడ్తోంది... కాని లేస్తే వాడికి కోపం వస్తుందిగదు! ప్రణయం! దీనికోసం ఎన్నెన్ని అఘాయిత్యాలు చేస్తాడు మనిషి! వాసు-! వీడు ఎంత మంచివాడని అనుకున్నాను... వీడుగూడా చివరకి ఇట్లా అర్ధరాత్రిదాకా దెయ్యంమల్లే మేల్కొని కూచుని.... నా ఆలోచన చప్పున ఆగి కిటికీ

అవతల కనపడ్డ స్త్రీరూపాన్ని గమనించింది... పొద్దున చూచిన అమ్మాయే ... గదిలో దీపం మరీ గుడ్డిగా వుంది... వెన్నెల వెల్తురు స్పష్టంగా వ్యక్తుల్ని కనపర్చేంతగా లేదు... వాసు కిటికీదగ్గరగా లేచినిలబడ్డాడు. సన్నగా గాలిలో ఈ సంభాషణ తేలివచ్చింది.

''నన్ను రక్షించాలి!'' స్త్రీ స్వరం బ్రతిమాలింది.

'' ఇందులో రక్షించేందుకు నేనెవర్ని?'' వాసు అన్నాడు సహజంగా.

''అయితే నా మాటమీద ఇదివరదాకా వేచివున్నారే!'' ఆశ్చర్యపడ్డది ఆమె.

''మీ కోర్కెని తిరస్కరించలేక'' వాసు ఆమెని తీక్షణంగా చూస్తున్నాడు.

''మిమ్మల్ని ఎట్లా... ఇదిగో ఈ కాగితం చదివితే నా పరిస్థితి మీకు బోధపడ్తుంది'' అని ఆమె ఒక కాయితం వాసు చేతిలో పెట్టింది.

''దీన్ని చదవ మంటారా?''

''అవునండి!''

''చదివి?''

''నా పరిస్థితి అర్థమైతే... నన్ను...''

'' ఓహో! సరే... శలవు...''

''వెళ్తానండి...''

ఆమె వెన్నెల్లోకలిసి వెళ్ళిపోయింది. వాసులేచి, టేబిల్‌లాంప్ పెద్దది చేశాడు, ఆమె ఇచ్చినకాయితం చదవాలని. నేనూ, విశ్వం ఇక ఓపికపట్టలేకపోయినాం. గభాలున లేచికూర్చున్నాం. వాసు మా వంక చికాకుగా, పరిహాసంగా చూశాడు. నన్ను లోలోపల ప్రశ్నలు వేధిస్తున్నై. వాళ్ళిద్దరి సంభాషణద్వారా వ్యవహారం ఏమాత్రం నాకు బోధపడలేదు.

విశ్వం ఆదుర్దాగా, వాసు దగ్గిరికి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. నేను టేబిల్ మీద కూర్చున్నాను.

'' ఏమిటిరా వాసూ! ఇదేం వ్యవహారంరా? మా తల చెడిపోతోంది! నీ చదువు నాశనమౌతుంది ఈ ప్రణయాలతో!'' అన్నాడు విశ్వం. వాసు పకపక నవ్వాడు.

''నవ్వితే సరా? ఆలోచించు!'' అన్నాడు సీరియస్‌గా.

వాసు మా యిద్దర్నీ తీక్షణంగా పరికించి, '' మీరు అతి తొందరపడుతున్నారు. నేచెప్పేది వినండి. ఆమె ఎవరో అసలు అర్థమన్నా చేసుకోలేకుండా మాట్లాడుతున్నారు'' అన్నాడు.

విశ్వానికి కోపంవచ్చింది. '' ఆమె ఎవరైనా, నీకు ప్రేమలేఖలు అందించే వరకూ రానేవచ్చింది. అది నిజమే కదా?'' అన్నాడు.

వాసు కోపం తెచ్చుకోలేదు. ''నిదానించండి. ఆమె ఇచ్చిన లేఖ లేక మరేదో దాన్ని చదువుతాను. విని, మరీ ఆలోచించండి!'' అన్నాడు.

''సరే చదువు'' అన్నాం.

వాడు చదవనారంభించాడు.

''మీ పేరు వాసు అని మీ స్నేహితులు మిమ్మల్ని పిలుస్తోంటే విన్నాను. అయినా మీ పేరుతో నాకేపని లేనట్టే భావిస్తున్నాను. కాగా, నన్నుగురించి మీకు కాస్తో కూస్తో వుపోద్ఘాతం ఇవ్వాలనుకుంటున్నాను. మాది బాపట్ల. మా అమ్మా నాన్నా భుక్తికి సరిపడా వున్నవాళ్ళే. అయినప్పటికీ, నా ఖర్మకి నన్నొదిలేశారు; బాపట్లలో నన్ను - నా అందం కోసమేననండి... మరెందుకోసమన్న కానీయండి, ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళు ప్రేమించారు; వెంటబడేవాళ్ళు. నా ఒక్క చూపుకోసం తహతహలాడే వాళ్లు. వాళ్ళల్లో ఎవ్వరికి నన్నిచ్చి పెళ్ళిచేసినా, నన్ను పూలలో పెట్టిపూజించుకునేవాళ్ళు. మావాళ్ళె కాదు, ఈ దేశంలోనే సగం వివాహాలు పిల్లల ఇష్టాలతో పనిలేకుండానే జరుగుతున్నై; అసలు వివాహమంటే అర్థం తెలియని పసివాళ్ళకి పెళ్లిళ్లు చేసే పెద్దలు తమ గురుతర బాధ్యతల్ని వొదిలించుకుని చేతులు కడుక్కుంటున్నారు. అలాగే, మావాళ్ళు, నన్ను ఇక రెండేళ్ళకి ఉద్యోగంనుండి రిటైర్ కానున్న ఓ పెద్దమనిషికి అంటగట్టారు. ఆయనకి ఆస్తి చాలావుంది. దానికోసమే మావాళ్ళు నాకీ పెళ్ళి చేశారు... మా ఆయనకి ఇక్కడే డెడ్‌లెటర్ ఆఫీసులో పని; ఆయనకి బంధువులు ఎక్కువ; వీళ్ళందరికీ, నేను చాకిరీ చేయాల్సి వచ్చింది. మామూలుగా, అందరు స్త్రీలకుమల్లే భౌతిక సుఖాలు నాకూ లభ్యమైనట్టయితే, చాకిరీని లెఖ్ఖ చెయ్యకపోదును. నాకు పదహారేళ్లు; నా భర్తకి యాభైయేళ్లు. ఆయనకి యౌవ్వన సుఖాల అనుభవం పూర్తయింది; నాకు ప్రారంభమైందని వేరే చెప్పడమెందుకూ?

ఈ పరిస్థితుల్లో, నా జీవితంలో ఒక తుఫాను రేగింది. నాభర్తకి దగ్గిర చుట్టం, అతను. మద్రాసులో వుద్యోగంకోసం వచ్చి మాయింట్లో మకాం పెట్టాడు.

అతనికి ఇరవైరెండేళ్లు వుంటాయి. చాలా కలుపుగోలు మనిషి. అందమైనవాడు నెల్లాళ్ళలో మా ఇద్దరిమధ్య పరిచయం ప్రకృతి శక్తుల ప్రయత్నం వల్ల ప్రేమగా మారింది.. దీన్లో నా తప్పేమీ లేదు అని మీరు అంగీకరిస్తారని భావిస్తాను. భావించడమేగాదు, ప్రాధేయపూర్వకంగా వేడుకుంటున్నాను. మేమిద్దరం మీ కంటపడ్డప్పుడు నేను భయపడ్డాను. కాని, మీరు వుదారులై నా రహస్యాన్ని - జీవిత రహస్యాన్ని దాచి వుంచడానికి అంగీకరించారు. మీ దగ్గిర దాచేందుకేమీ లేదు. నాకు అన్నయ్యలూ తమ్ముళ్ళూవున్నారు. మీరు నాకు అన్నయ్యవంటివారని భావించి మీకు ఇంకోవిషయం విన్నవిస్తున్నాను. ఈ విషయాన్ని మా అన్నయ్యకన్నా చెప్పనేమో.

నా ఈ జీవనరకాన్నించి... నన్ను స్వర్గసీమలకు తీసుకెళ్తానని నా ప్రియుడు వాగ్దానం చేశాడు. నేనూ అంగీకరించాను... మా రహస్యాన్ని మీ ముందు వుంచాను. మీరు నాకు చేసే సాయమల్లా నా రహస్యాన్ని బయటపెట్టకుండా వుండడమే. మీరు నాకు ఈ సాయంచేస్తారని నేను పూర్తిగా గాఢంగా నమ్ముతున్నాను. ఎందుకని అంటారా? ఒక స్త్రీని ఆమె ప్రేమరహస్యాలు తెలిసిగూడా, ఆమెని ప్రియుడితో చూసిగూడ తనకి ఛాన్సు కావాలని ఏ మొగాడు ఎగబడకుండా వుంటాడు? అయితే మీరట్లా ఎగబడలేదు: ఉపేక్షించి వూరుకున్నారు! ఇది చాలదా మిమ్మల్ని నమ్మేందుకు!

నాకు మీ సలహాని ఒక చీటీవ్రాసి, కిటికీకింద పడెయ్యండి. తీసుకోగలను.

వాసు ఆ లేఖను జాగ్రత్తగా మడిచి జేబులో పెట్టుకుని, '' ఇప్పుడేమంటారు?'' అన్నాడు వాడి మామూలు వ్యంగ్య పూరితమైన నవ్వుతో. నాకు ఏమనాలో తోచలేదు. విశ్వం పదినిమిషాలు విభ్రాంతుడై మౌనంగావున్నాడు. కిటికీనుంచి వచ్చిన గాలితరంగం మాలో సంచలనం కలిగించి, మౌనవాతావరణాన్ని భగ్నపర్చింది. విశ్వం వాసుచెయ్యి అతి ప్రేమతో పట్టుకొన్నట్టుగా షేక్‌హాండ్ ఇచ్చి '' ఆహా! త్యాగివి! పేరు నిలబెట్టావురా!'' అన్నాడు సంతోషంతో.

''ఏం పేరు?'' అన్నాను నేను.

''మన నీతిపేరు!'' అన్నాడు విశ్వం ఆనందంతో వాసుకీ, నాకు సిగరెట్లు అందిస్తో.

''తరవాత!'' అని అడిగాను, ఇంకా ఏం జరగబోతోందా అన్నట్టు.

''ఏం జరుగుతుంది? వాళ్ళిద్దరూ, వాసు ఆశీర్వాదంతో రేపీపాటికి స్వర్గసీమల్లో విహరిస్తోంటారు!'' అన్నాడు విశ్వం.

తరవాత ముగ్గురం, ఏదో మాకేతెలియని ఆత్మశాంతితో పడుకొని నిద్రపోయినాం.

తెల్లారి ఏమీ వింతలు జరగలేదు. మరుసటిరోజున కొద్దిగా మబ్బుపట్టి ఆకాశం చాలా అందంగా కన్పిస్తోంది. ఆదివారం కావటం వల్ల ముగ్గురం పదింటికే భోంచేసివచ్చి టేబిల్ గదిమధ్యకి లాక్కొని కుర్చీలో తాపీగా కూర్చుని పేక ఆడుకుంటున్నాం. పక్కయింటిలో ఏదో కలవరం జరుగుతుందనుకున్నాం. అది ఎంతకీ జరక్కపోవడంతో నాకు నిరాశఎక్కువౌతోంది. పేకసాగుతోంది. సిజర్లు మళౌతున్నాయి... మధ్యాహ్నం 12 గంటలవరకూ పేక ఆడింతర్వాత కాస్తవిశ్రాంతి తీసుకుందామనిపించి ఈజీచైర్‌లో వాలబోతున్నాం... దక్షిణపుకిటికీ అవతల దొడ్లో, ఆ ఇంట్లో జనాభా అంతా పోగై గుసగుసలాడుతున్నారు. మే మనుకున్నదే ఐవుంటుంది... కానీ, ఆ తర్వాత ఏవిషయమూ పైకి పొక్కలేదు. రిటైర్డు ఉద్యోగి జరిగిన పరాభవాన్ని భరించి, మౌనంగా వూరుకున్నాడల్లేవుంది. ఇది మామూలేగా! స్త్రీ హత్యల్ని, భ్రూణహత్యల్ని సహించి వూరుకునే మన సమాజ అసహజ నీతి వ్యవస్థ ఒక యువతి లేచిపోతే దాన్ని బైటపెట్టుకుని బజార్లపాలు కావడానికి ఎప్పుడూ అంగీకరించదు. అసలు, మన సాంప్రదాయధర్మాల దృక్కోణప్రకారం అన్యాయం - లేక అధర్మం బహిరంగంగా జరిగితేనే దానికి శిక్ష! రహస్యంగా జరిగే లక్షల తప్పులకి, అది స్పష్టంగా తప్పు అనీ అవినీతి అనీ ఆ సాంప్రదాయ ధర్మప్రకారమే రుజువైనా, ఏ శిక్షా లేదు! తప్పులు కాని వాట్ని తప్పులని నిర్దేశించడం, ఆ తప్పులు చేయడానికిగల మూలకారణాల్ని తొలగించలేకపోవడమూ దౌర్బల్య చిహ్నమేగదా! కానీ, వీట్ని గాఢంగా ఆలోచించేవాళ్ళే వుండరు. ఎవరికి వారే ఎప్పటికప్పుడే ఏదో వెధవ సమాధానాలు చెప్పుకుంటో, 'రొటీన్'గా 'బోర్' అవుతూవుంటారు ఈ నీతులమధ్య! ఆ లెఖ్ఖన మేం మాత్రం అట్లాకాదూ వుంది? ... ఇట్లా ఆలోచిస్తోపడుకుని నిద్రపోయినాం ఆవాళ్టికి.

(కథావాహిని 1955)